సికింద్రాబాద్ డీసీసీ కార్యదర్శుల నియామకం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సికింద్రాబాద్ డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యదర్శులుగా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులను ఆ పార్టీ డీసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ నియమించారు. మాజీ ఎంపీ, ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జీ అంజన్‌కుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు మహేశ్వరి, మమత, పూజా, తస్లీన్‌బేగం, శాలిని, మహేష్‌చంద్ర, హేమంత్‌కుమార్‌లను కార్యదర్శులుగా బుధవారం నియమిస్తు ఓల్డ్ ఎమ్మెల్యే క్వాటర్స్‌లో నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కల్పన యాదవ్, కంటెస్ట్ కార్పొరేటర్ లోకేష్‌యాదవ్, సిరాజ్, హర్ష, శేఖర్, శ్రీధర్‌యాదవ్, పవన్ పాల్గొన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ... పార్టీని నమ్ముకున్న వారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. వీరంతా పార్టీని బలోపేతం చేయడంతో పాటు రానున్న పార్లమెంటు ఎన్నికల్లో తమ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు.


సికింద్రాబాద్ డీసీసీ కార్యదర్శులుగా నియమితులైన వారితో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

మెరుగైన వసతుల కల్పనే లక్ష్యం

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: కాలనీలు, బస్తీలనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ మెరుగైన వసతులు కల్పించే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం అంబర్‌పేట్ డివిజన్ బాపూనగర్‌లో రూ. 26 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ పనులను స్థానిక కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల సమస్యల పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.


బాపూనగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అర్హులందరికీ 'సంక్షేమ' ఫలాలు


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

కాచిగూడ: అర్హులైన పేద ప్రజలందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. కాచిగూడ డివిజన్‌కు సంబంధించిన అర్హులైన లబ్ధిదారులకు హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్‌తో కలిసి కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ. 1,00,116 చొప్పున కల్యాణలక్ష్మి చెక్కులను 35 మందికి అందించారు. తమ ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా నిలిచిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు ఈ సందర్భంగా లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి, బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆది నగేష్ సేవలు చిరస్మరణీయం


ఆది నగేష్ కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

కాచిగూడ: బీజేపీ సీనియర్ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు స్వర్గీయ ఆది నాగేష్‌కుమార్ మున్నూరు కాపులకు అందించిన సేవలు చిరస్మరణీయమని మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం కాచిగూడలోని మ్యాడం అంజయ్య హాల్‌లో ఏర్పాటు చేసిన ఆది నాగేష్ కుమార్ సంతాప సభలో ఆయన పాల్గొని నగేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాగేష్ కుమార్ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజా నాయకుడు కొనియాడారు. నేతలు కొండూరు వినోద్ కుమార్, కొంతం సురేష్ బాబు, లింగిశెట్టి హనుమంతరావు, మించు ఆనంద్ కుమార్, తోట భూమయ్య, మడిగల వెంకటేష్, గడ్డి చంద్రశేఖర్, కొరివి వేణుగోపాల్, ఏనుగుల మాణిక్ ప్రభు, గడేకర్ల సత్యనారాయణ, దివంగత ఆది నాగేష్ కుమార్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పారదర్శక ఓటరు జాబితాకు సహకరించండి

అంబర్‌పేట్: అంబర్‌పేట నియోజకవర్గంలో పారదర్శక ఓటర్ జాబితా తయారు చేయడానికి సహకారించాలని అంబర్‌పేట సర్కిల్-డీఎంసీ మారుతీ దివాకర్ కోరారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో ఓటర్ జాబితా పారదర్శకతపై వివిధ రాజకీయ పక్షాల నేతలతో సమావేశాలు నిర్వహించారు. కొత్త ఓటర్ల నమోదు, సవరణల వంటి అంశాలపై సలహాలు, సూచనలు చేయాల్సిందిగా ఆయన కోరారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ విడదల లోపే పకడ్బందీ ఓటర్ల జాబితా రూపొందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంసీ మారుతీదివాకర్

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు


మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న మల్లికార్జున్‌రెడ్డి

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నగర సీనియర్ నాయకులు ఎస్.మల్లికార్జున్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి తన అనుచరులతో బుధవారం టీపీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంజన్‌కుమార్‌యాదవ్ మల్లికార్జున్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడానికి స్వాగతిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీ సిద్ధాంతాలు సీఎం రేవంత్‌రెడ్డి పనితీరు చూసి కాంగ్రెస్‌లో చేరిన మల్లికార్జున్‌రెడ్డికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని అంజన్‌కుమార్‌యాదవ్ తెలిపారు. పార్టీలో చేరిన మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌లో అనేక సంవత్సరాలుగా పని చేస్తున్నప్పటికి ఎలాంటి గౌరవం ఇవ్వలేదని తెలిపారు. రేవంత్‌రెడ్డి చేస్తున్న పనితీరు చూసి కాంగ్రెస్‌లో చేరడం జరిగిందన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు. మాజీ కార్పొరేటర్ కల్పన యాదవ్, అడిక్‌మెంట్ డివిజన్ అధ్యక్షులు తిరుమల, కాంగ్రెస్ నగర ప్రధాన కార్యదర్శి బి.యాదగిరిగౌడ్, నాయకులు మారిశెట్టి నర్సింగ్‌రావు, లోకేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ టైలర్స్ డే


కుట్టు మిషన్‌లు అందించే కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ అశోక్

అంబర్‌పేట్: రోజురోజుకూ టైలర్స్ వృత్తి మసకబారుతోందని అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ అన్నారు. బుధవారం అంతార్జాతీయ టైలర్స్ డేను పురస్కరించుకొని సేవా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో టైలర్ వృత్తిలో కొనసాగుతున్న పలువురిని సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌స్పెక్టర్, హైకోర్టు న్యాయవాది జి.ఎల్.నరసింహారావు, ప్రముఖ సంఘ సేవాకులు బాబా పలువురిని సత్కరించి అభినందించారు. అనంతరం పేదలకు కుట్టు మిషన్‌లు సహితం అందించారు. పలువురు టైలర్స్, సేవా యూత్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పుల్లయ్యకు వీడ్కోలు

ముషీరాబాద్: టీఎస్‌ఆర్‌టీసీ అకౌంట్స్ ఆఫీసర్‌గా నల్లగొండ రీజియన్‌లో పని చేస్తూ పదవీ విరమణ పొందిన బూడిగ పుల్లయ్యకు బస్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బుధవారం తోటి ఉద్యోగస్తులు వివిధ శాఖల అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. టీఎంయూ రాష్ట్ర కార్యదర్శి రేసు శ్రీనివాస్‌గౌడ్ హాజరై పుల్లయ్యను ఘనంగా సత్కరించారు.

కార్మికశాఖలో భారీగా ఏసీఎల్‌ల బదిలీలు

చిక్కడపల్లి: రానున్న లోకసభ ఎన్నికల దృష్ట్యా ఒకే ప్రాంతంలో మూడేళ్లకు పైగా విధులు నిర్వహిస్తున్న పలువురు అసిస్టెట్ లేబర్ కమిషనర్‌లు (ఏసీసీఎల్)ను బదిలీ చేస్తూ రాష్ట్ర కార్మిక శాఖ సంచాలకుడు ఎస్.కృష్ణ ఆదిత్య ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 మంది ఏసీఎల్‌లను బదిలీ చేశారు. అయితే వాటర్ బోర్డ్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఉన్న మహిళను హైదరాబాద్ ఏసీఎల్-2గా నియమించారు. వివరాలివీ... ప్రస్తుతం హైదరాబాద్ హెడ్ ఆఫీస్ ఏసీఎల్-2గా విధులు నిర్వహిస్తున్న జి.నారాయణ స్వామి సూర్యాపేటకు, హైదరాబాద్ ఏసీఎల్-2గా ఉన్న జి.బాలనర్సింహస్వామిని ఖమ్మంకు, ఏసీఎల్-3గా ఉన్న ఎ.సత్యనారాయణరెడ్డిని హెడ్ ఆఫీస్‌కు, ఏసీఎల్-3గా ఉన్న ఎస్.వెంకటరాముడును భద్రాద్రి కొత్తగూడెంకు బదిలీ చేశారు. వరంగల్ ఏసీఎల్ ఏసీఎల్ కోలా ప్రసాద్‌ను కరీంనగర్‌కు, కరీంనగర్ ఏసీఎల్ ఎం.కోటేశ్వర్లును కామారెడ్డికి, జగిత్యాల ఏసీఎల్ ఎ.రాజేశ్వర్‌రమ్మను వరంగల్‌కు, ఆదిలాబాద్ ఏసీఎల్ జి.శ్రావణిని నిజామాబాద్‌కు, మేడ్చల్-మల్కాజిగిరి ఏసీఎల్ పి.ప్రభావతిని మహబూబ్‌నగర్‌కు, మహబూబ్‌నగర్ ఏసీఎల్ ఎం.యాదయ్యను మేడ్చల్-మాల్కాజిగిరికి, ప్రస్తుతం సంగారెడ్డి ఏసీఎల్‌గా ఉన్న ఏసీఎల్‌గా ఉన్న ఏసీఎల్‌ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.జాసన్‌ను జగిత్యాలకు బదిలీ చేశారు. నిజామాబాద్ ఏసీఎల్ ఇ.ముత్యంరెడ్డిని హైదరాబాద్-3ఏసీఎల్‌గా కామారెడ్డి ఏసీఎల్ ఎం.సురేందర్‌కుమార్‌ను ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు. ఇదిలా ఉండగా... వాటర్‌బోర్డ్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఉన్న పొట్ల కృష్ణవేణిని హైదరాబాద్ ఏసీఎల్‌గా-2 బదిలీ చేస్తూ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు.

పరామర్శ


ఆది నాగేష్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నల్లకుంట: నల్లకుంట టీఆర్టీ కాలనీలో నివాసముండే బీజేపీ సీనియర్ నేత ఆది నాగేష్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావుతో కలిసి బుధవారం టీఆర్టీ కాలనీలోని మృతుడి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చిన కిషన్‌రెడ్డి వారికి ధైర్యం చెప్పారు. మృతుని కుటుంబాన్ని ఓదార్చిన వారిలో బీజేపీ కార్పొరేటర్ అమృత, బీజేపీ సెంట్రల్ జిల్లా కార్యదర్శి నాయిని బుచ్చిరెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా స్టేట్ ఎక్జుక్యూటివ్ మెంబర్ మహేష్ కుమార్, సీనియర్ నాయకులు నర్సింగ్ రావు, శ్యామ్‌రాజ్, రమేష్ యాదవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తే చూస్తూ ఊరుకోం

ముషీరాబాద్: ఎన్నికల ముందు ఒకే సారి పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మాట మారుస్తూ నిరుద్యోగులను మోసం చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య అన్నారు. 26 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా ఐదు, పది వేల ఉద్యోగాలంటూ మోసపూరిత నాటకానికి తెరలేపుతున్నారని ఆరోపించారు. బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలోని కొందరు అధికారుల మాటలు నమ్మి ప్రభుత్వం గుడ్డిగా ముందుకు వెళ్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే టెట్ నిర్వహించి, పూర్తిస్థాయిలో టీచర్ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. బీసీ నేత ప్రధానిగా ఉన్నా వెనకబడిన వర్గాలకు అన్ని రంగాల్లో తీరని అన్యాయం జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు అన్ని రంగాల్లో సమన వాటా, చట్టసభల్లో, విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు, కులగణన చేపడతామని అన్ని పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు నీల వెంకటేష్, రాజ్‌కుమార్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణయ్యతో మాజీ మంత్రి 'పట్నం' దంపతుల భేటీ

మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి సునీతారెడ్డి బుధవారం ఆర్.కృష్ణయ్యతో సమావేశమయ్యారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌కు వచ్చిన మహేందర్‌రెడ్డి దంపతులు కృష్ణయ్యతో ప్రత్యేకంగా సమావేశమై అరగంట పాటు చర్చించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన మహేందర్‌రెడ్డి ఆర్.కృష్ణయ్యతో ప్రత్యేకంగా సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ విషయమై మీడియా ప్రశ్నించగా పాత మిత్రులము కాబట్టి సహజంగా కలిశామని చెప్పుకొచ్చారు.

24వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

కాచిగూడ: టెట్, మెగా డీఎస్సీ కింద 24వేల ఖాళీ టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ప్రిన్సిపల్ సెక్రెటరీని కలిసి వినతి పత్రం అందజేసింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెగా డీఎస్సీ ప్రకటించడం అభినందనీయమే అయినా, టెట్‌కు కూడా నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ముఖ్యమంత్రి టీచర్ పోస్టుల విషయంలో అధికారులపై ఆధారపడకుండా నిరుద్యోగ సంఘాలు, ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించాలని కోరారు. ప్రస్తుతం 11వేల టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారని, చాలా మంది టెట్ పాస్ కానివారు ఉన్నారని, బీఈడీ, డీఈడీ చేసిన వాళ్లు 4 లక్షల మంది టెట్ నోటిఫికేషన్ కొరకు ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. అన్ని కేటగిరీల పోస్టులను భర్తీ చేసి పాఠశాల విద్యావ్యవస్థను పటిష్టం చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

- నిర్ణీత సమయంలోపే హాజరైన విద్యార్థులు
- కేంద్రాల వద్ద ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్
- పలు ప్రాంతాల్లో స్తంభించిన ట్రాఫిక్


అంబర్‌పేట్‌లోని ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

అంబర్‌పేట్: ఇంటర్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో బుధవారం ఆయా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ఉదయం 9 గంటల లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షను రాశారు. అంబర్‌పేట్‌లో వివిధ ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలలో ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు మొదటి రోజు జరిగాయి.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్‌తో పరేషాన్

నల్లకుంట: నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజున గంట ముందు నుంచే ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవడం కనిపించింది. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద సివిల్ పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్ సమస్యలు...

నల్లకుంట శంకరమఠం రోడ్డులో సెంట్ పాట్రిక్, శంకరమఠం మార్కెట్ రోడ్డులోని నారాయణ, శంకరమఠం సమీపంలోని నానో కళాశాలల్లో (మూడు) పరీక్షా కేంద్రాలు, మరొకటి శివం రోడ్డులో ఏర్పాటు చేశారు. వంద మీటర్ల లోపే ఉన్న ఈ మూడు పరీక్షా కేంద్రాలకు కనీసం పార్కింగ్ స్థలం కూడా లేదు. దీంతో విద్యార్థులను పరీక్షా కేంద్రాల వద్ద వదిలేందుకు, పరీక్ష అనంతరం తీసుకు వెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులు ఇష్టారాజ్యంగా తమ వాహనాలను రోడ్డుపైనే నిలిపారు. దీంతో ఉదయం పరీక్ష ప్రారంభానికి ముందు, మధ్యాహ్నం పరీక్ష ముగిసిన సమయంలో నల్లకుంట సెంట్ పాట్రిక్ కళాశాల సమీపంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నుంచి హిందీ మహా విద్యాలయం వరకు దాదాపు అర కిలోమీటర్‌కు పైగా వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు పరీక్ష ముగిసిన సమయంలో పరీక్షా కేంద్రాలు, సమీపంలోని యూటర్న్ వద్ద కనీసం ఒక్క ట్రాఫిక్ పోలీసు కూడా కనిపించలేదు. దీంతో వాహనదారులు ఇష్టారాజ్యంగా వెళుతూ మరింతగా ట్రాఫిక్ సమస్యలు సృష్టించారు.

ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలో...

ముషీరాబాద్: ఇంటర్మీడియట్ పరీక్షలు ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ పిల్లలకు ధైర్యం చెపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అంజుమన్ జూనియర్ కాలేజీలో 294 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ఆరుగురు విద్యార్థులు గైర్హాజర్ అయ్యారు. రాంనగర్ సెయింట్ పాయిస్ జూనియర్ కాలేజీలో 579 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ఆరుగురు గైర్హాజర్ అయ్యారు.


నల్లకుంట-శంకరమఠం సెంట్ పాట్రిక్ కళాశాల వద్ద రోడ్డుపైనే నిలిపిన వాహనాలు


శంకరమఠం నుంచి హిందీ మహా విద్యాలయం సిగ్నల్స్ వైపు నిలిచిపోయిన వాహనాలు


భోలక్‌పూర్ అంజుమన్ కాలేజీలో పరీక్షలు రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న 'రోజ్‌బడ్స్' వైజ్ఞానిక అంశాలు

అంబర్‌పేట్: విద్యార్థులు తమ ఆవిష్కరణలతో అబ్బురపరిచారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని బాగ్ అంబర్‌పేట్‌లో రోజ్‌బడ్స్ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. వారి కొత్త ఆలోచనలకు పదును పెట్టి వాతవారణ సమతుల్యత, స్పేస్, పర్యవరణం, వివిధ సాంకేతిక అంశాలను ప్రదర్శించి ఆలోచింపచేశారు. పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ సవితలు అభినందించారు.


విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి

దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలి


సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సూపర్ ట్విన్‌సిటీస్ హై స్కూల్ (అంబర్‌పేట) 31వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. మీ భవిష్యత్తుకు మీరు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ ఎం.శశికళ, ప్రిన్సిపాల్ ఎం.చంద్రమోహన్, ఆపోపా అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ పోలా విజయ్‌కుమార్, అపోపా కోశాధికారి కందికొండ శ్రీనివాస్, టీఎస్ఎస్‌పీడీసీఎల్ జనరల్ మేనేజర్ మిర్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

పరిశోధనలు సమాజ పురోగతికి తోడ్పడాలి


సౌర వ్యవస్థ తీరును విద్యార్థులకు వివరిస్తున్న రుక్మిణి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పరిశోధనలు సమాజ పురోగతికి తోడ్పడాలని ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.రుక్మిణి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో నేషనల్ సైన్స్‌డేను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రుక్మిణి మాట్లాడుతూ... మన దేశం సైన్స్ పరంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని దానికి నిదర్శనం ఇటీవల ఇస్రో సాధించిన ఘన విజయమే అన్నారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.సరోజా వివేక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రుక్మిణి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ రిషికాంత్, ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ టైలర్స్ డే

అంబర్‌పేట్: రోజురోజుకూ టైలర్స్ వృత్తి మసకబారుతోందని అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ అన్నారు. బుధవారం అంతార్జాతీయ టైలర్స్ డేను పురస్కరించుకొని సేవా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో టైలర్ వృత్తిలో కొనసాగుతున్న పలువురిని సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌స్పెక్టర్, హైకోర్టు న్యాయవాది జి.ఎల్.నరసింహారావు, ప్రముఖ సంఘ సేవాకులు బాబా పలువురిని సత్కరించి అభినందించారు. అనంతరం పేదలకు కుట్టు మిషన్‌లు సహితం అందించారు. పలువురు టైలర్స్, సేవా యూత్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలను చూసి 'ఇన్‌స్పైర్' కావాలి


సత్యం టెక్నో స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

కాచిగూడ: నేటి తరం విద్యార్థులు ఆర్యభట్ట, అబ్దుల్ కలాం, మోక్షగుండం విశ్వేశ్వరయ్య వంటి శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకుని డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలుగా ఎదగాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, సత్యం టెక్నో స్కూల్ చైర్మన్ గుజ్జ సత్యం అన్నారు. బుధవారం స్కూల్లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్స్‌ను తిలకించి విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల్లో నెలకొన్న సామాజిక స్పృహను పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అరవింద్ బాబు, వెంకటేశం, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో నైపుణ్యాల వృద్ధి


వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న ఇస్రో శాస్త్రవేత్త సుధీర్

కాచిగూడ: వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను పెంచుతాయని ఇస్రో శాస్త్రవేత్త సుధీర్ అన్నారు. నారాయణగూడ లోని భవన్స్ న్యూ సైన్స్ కళాశాలలో బుధవారం జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు దేశం గరివ్వంచే శాస్త్రవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనతో పాటు ఫుడ్ ఫెస్ట్‌ను నిర్వహించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ ఎస్.జైకిషన్, ప్రిన్సిపాల్ పి.కృష్ణారావు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలి


సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, నాగేందర్

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకున్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. రాంనగర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు నాగేందర్ ఆధ్వర్యంలో గంగపుత్ర కాలనీలో నిర్వహించిన సామూహిక సత్యనారాయణ వ్రతం పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్య అతిధిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేను నిర్వహకులు ఘనంగా సన్మానించారు. బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకులు ముఠా జైసింహ, ఆలిండియా గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షులు పూసగోరఖ్‌నాథ్, రాంనగర్ గంగపుత్ర సంఘం అధ్య, కార్యదర్శులు నాగేందర్, జగదీష్, బీఆర్‌ఎస్ మీడియా సెల్ ఇన్‌చార్జీ ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు గోవింద్, కమలాకర్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.